సాక్షి సిద్దిపేట

I

శనివారం । 27 । ఏప్రిల్ । 2024



బస్వాపూర్ టూ గల్ఫ్

కోహెడ మండలం బస్వాపూర్ గ్రామం గల్ఫ్ దేశాల వలసలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. వివరాలు IIలో ▸



నిప్పు.. భూసారానికి ముప్పు

వరి కోత తర్వాత రైతులు పొలంలోని కొయ్యకాళ్లను నిప్పుతో కాల్చి వానాకాలం పంటకు సిద్ధం అవుతున్నారు. వివరాలు IIలో ▸



ఎట్టకేలకు పనులు ప్రారంభం

దాదాపు ఏడాది తర్వాత అక్కన్నపేట మండల కేజీబీవీ భవన నిర్మాణ పనులు పునః ప్రారంభమయ్యాయి.

వివరాలు IIIలో ▸

న్యూస్‌రీల్

పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్



జగదేవ్‌పూర్ పీహెచ్‌సీలో పసికందును పరీక్షిస్తున్న వైద్యాధికారి

జగదేవ్‌పూర్(గజ్వేల్): పీహెచ్‌సీల్లో నార్మల్ ప్రసవాల సంఖ్య పెంచాలని, తల్లి బిడ్డల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన వైద్య సేవలను రోగులకు అందించాలన్నారు. వడదెబ్బ లక్షణాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కేంద్రానికి వచ్చే 30 ఏళ్ల పైబడి ఉన్న వారందరికి ఎన్‌సీడీ కార్యక్రమంలో భాగంగా స్క్రీనింగ్ నిర్వహించాలని, అవసరం ఉన్నవారికి మందులు ఇవ్వాలన్నారు. ఆరోగ్య సిబ్బంది డ్రెస్ కోడ్ పాటించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్‌పాంపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఉద్యాన, సెరికల్చర్ కమిషనర్ అశోక్‌రెడ్డి

సిద్దిపేటరూరల్: ఆయిల్‌పాం తోటల సాగు లక్ష్యాన్ని చేరుకునేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఉద్యాన, సెరికల్చర్, ఆయిల్‌ఫెడ్ ఎండీ అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లాలో పర్యటించిన ఆయన కలెక్టరేట్‌లోని ఉద్యాన, వ్యవసాయ, ఆయిల్‌ఫెడ్, మైక్రో ఇరిగేషన్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో పామాయిల్ తోటల సాగుపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో పామాయిల్ తోటల పెంపకానికి చాలా అవకాశాలు ఉన్నాయన్నారు. పామాయిల్ తోటల విస్తీర్ణంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల తర్వాత 11,140 ఎకరాలు సాగు చేస్తూ సిద్దిపేట మూడో స్థానంలో ఉందన్నారు. నర్మెట్టలో రూ.300 కోట్లతో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం జరుగుతోందని చెప్పారు. రైతులు పండించిన పామాయిల్ పంట మార్కెటింగ్ కు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది జిల్లాకు నిర్దేశించిన 7వేల ఎకరాల మేర ఆయిల్‌పాం సాగుకు రైతులు కృషి చేయాలన్నారు. రానున్న రెండు రెండేళ్లలో 25వేల ఎకరాల మేర సాగు జరగాలని సూచించారు. పామాయిల్ పంటలకు అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉన్నందున రైతులకు అధిక లాభాలు వస్తాయన్నారు. ఎట్టి పరిస్థితుల్లో నష్టం జరగదని, రైతులను మరింతగా పంట సాగుకై ప్రోత్సహించాలన్నారు. ఆయిల్‌పాం సాగు రైతులతో మండలాల వారీగా వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి పంట రక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, అంతరపంటల వివరాలు తెలియజేస్తూ రైతులకు ఆదాయం పొందేలా ప్రోత్సహించాలన్నారు. ఫ్యాక్టరీ నిర్మాణ పనులను ఉన్నతాధికారులు తరచుగా సందర్శించి పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఉద్యాన అధికారి సువర్ణ, వ్యవసాయాధికారి శివప్రసాద్, ఆయిల్ ఫెడ్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రుణమాఫీపై రాజకీయ డ్రామాలు

మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

నిజాంపేట(మెదక్): రుణమాఫీపై మాజీ మంత్రి హరీశ్‌రావు, సీఎం రేవంత్‌రెడ్డి డ్రామాలు ఆడుతున్నారని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలో రోడ్ షో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కలిసి బీజేపీ గెలుపును అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. హరీశ్‌రావు, సీఎం రేవంత్‌రెడ్డి మార్చి 19వ తేదీన ఢిల్లీ నుంచి హైదరాబాద్ కలిసి వచ్చి రోజూ మీడియాలో కనిపించడానికి డ్రామాలు ఆడుతున్నారన్నారు. రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ టీఆర్‌ఎస్‌గా మారడంతో పాటు హరీశ్‌రావు కొత్త పార్టీ పెట్టే అవకాశం ఉందన్నారు. గత పాలనలో రూ. లక్ష రుణమాఫీ చేయనందుకు కేసీఆర్, హరీశ్‌రావు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు కావొస్తున్న నేటికీ ఆరు గ్యారంటీలు అమలు కాలేదని వాపోయారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన వారు బీజేపీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, జెడ్పీటీసీ విజయ్ కుమార్ పాల్గొన్నారు.





సభకు హాజరైన జనం, (ఇన్‌సెట్లో) అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

‘ఖేడ్’కు ఫార్మా

- కంపెనీలు తీసుకువస్తాం
- యువతకు ఉపాధి కల్పిస్తాం
- ఇందిరమ్మ రాజ్యం సాక్షిగా అభివృద్ధి సాధిస్తాం
- సీఎం రేవంత్‌రెడ్డి

నారాయణఖేడ్/పెద్దశంకరంపేట: ఇందిరమ్మ రాజ్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందిందని, పరిశ్రమల ఏర్పాటుకు 2 వేల ఎకరాలు సేకరించి ఇస్తే నారాయణఖేడ్ ప్రాంతంలో ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. జహీరాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ తరఫున ఎన్నికల ప్రచారంలో భాగంగా పెద్దశంకరంపేట పట్టణంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ‘జనజాతర’సభలో సీఎం పాల్గొని ప్రసంగించారు. మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, అభ్యర్థి సురేశ్ షెట్కార్ కోరినట్లు భూమి సేకరించి ఇస్తే కోడ్ ముగిశాక ఎన్నికల అనంతరం ఫార్మ కంపెనీలను తెచ్చి ఫార్మ క్లస్టర్, ఫార్మ విలేజ్‌ను ఏర్పాటు చేస్తానని స్పష్టం చేశారు. తద్వారా వేలాది మంది యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే బాధ్యత తనదని భరోసా ఇచ్చారు. భూమి అప్పగించిన 30 రోజుల్లో ఫార్మా క్లస్టర్, ఫార్మా విలేజ్ ఏర్పాటు బాధ్యత తనదన్నారు. ఆడబిడ్డలు చదువుకొనేందుకు ఎన్నికల కోడ్ అనంతరం మహిళా ఐటీఐ ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులు 24 గంటలు చదువుకునేందుకు స్పెషల్ డెవలప్‌మెంట్ నిధుల నుంచి రూ. 2 కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాలకు న్యాయం జరిగేందుకు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేందుకు, రిజర్వేషన్లు పెంచుకునేందుకు కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. బీబీ పాటిల్ అంగి, రంగు, టోపీ మార్చి బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలోకి వచ్చారని, ఆయన ఏ మాత్రం అభివృద్ధి చేయలేదన్నారు. జహీరాబాద్ పార్లమెంట్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ పరిస్థితి దారుణంగా తయారైందని.. ఆయనను ఎవ్వరూ పట్టించుకోవడం లేదని బాధపడుతున్నారని ఎద్దేవా చేశారు. పేదలకు ఇళ్లు, పింఛన్లు ఇవ్వాలన్నా, బసవేశ్వర, సంగమేశ్వర ప్రాజెక్టు కట్టాలన్నా, డిగ్రీ కళాశాల, ఉన్నత విద్య కావాలన్నా, పేదలను ఆదుకోవాలన్నా కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. సురేశ్ షెట్కార్ రాష్ట్ర ఏర్పాటు కోసం పార్లమెంట్‌లో పోరాటం చేశారని, సౌమ్యుడు, అభివృద్ధి కాముకుడు గెలిపిలించాలని అభ్యర్థించారు. ఖేడ్ ఎమ్మెల్యే టికెట్ సోనియాగాంధీ, మల్లిఖార్జున ఖర్గే కేటాయిస్తే డాక్టర్ సంజీవరెడ్డికి కేటాయించి గెలిపించారని కొనియాడారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇందిరమ్మ ఎంపీగా ఉండగా బీహెచ్‌ఈఎల్, ఐడీపీఎల్, బీడీఎల్ తదితర పరిశ్రమలు ఏర్పాటు చేయడంతో పారిశ్రామికంగా అభివృద్ధి చెందిందన్నారు.

రాజీవ్ ఆరోగ్యశ్రీ నిర్వీర్యం..

నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉండగా కాంగ్రెస్ పాలనలో రాజీవ్ ఆరోగ్య శ్రీ ప్రవేశపెట్టి పేదలు సైతం కార్పొరేట్ వైద్యం చేయించుకునేలా చేశారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కానీ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో పథకాన్ని నిర్వీర్యం చేశారని ఆరోపించారు.

400 సీట్ల మర్మమేమిటి: మంత్రి దామోదర

ప్రధాని నరేంద్రమోదీ 400 సీట్ల మర్మం కేవలం రిజర్వేషన్ల తొలగింపు, రాజ్యాంగం మార్చడమేనని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ధైర్యానికి, మంచికి మారు పేరు సురేశ్ షెట్కార్ అని కొనియాడారు. 60 ఏళ్ల కలను సాకారం చేసిన సోనియాగాంధీ ఆశయాన్ని కొనసాగించాలంటే మరోసారి కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ ఇచ్చి ఎంపీగా సురేశ్ షెట్కార్‌ను గెలిపించాలని కోరారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కాలేదు అప్పుడే రుణమాఫీపై గగ్గోలు పెడుతూ రైతులపై కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారని విమర్శించారు.

10 ఏళ్లలో ఏం చేశారు: సురేశ్ షెట్కార్

పదేళ్లు అధికారంలో ఉన్న బీబీ పాటిల్ జహీరాబాద్ ప్రాంతానికి ఏమి చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్ అన్నారు. గతంలో నేను చేసిన అభివృద్ధి పనులను తాను చేశానని చెప్పుకోవడం దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. ఈ ప్రాంతానికి ముంబై, అకోలా నేషనల్ హైవేలతో పాటు, నిమ్జ్ ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. సింగూరు ద్వారా 6 టీఎంసీల నీరు కేటాయించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని, నారాయణఖేడ్ ప్రాంతంలో ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

బీఆర్‌ఎస్, బీజేపీ ఒక్కటే

- నీలం మధును భారీ మెజారిటీతో గెలిపిద్దాం
- దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ



ర్యాలీలో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీఆర్‌ఎస్, బీజేపీలు ఒక్కటేనని, చీకటి ఒప్పందాలు చేసుకున్నాయని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దోచుకున్న డబ్బును ఎక్కడ దాచుకోవాలో బీఆర్‌ఎస్ నేతలకు అర్థంకావడంలేదని, అందుకే వారిలో భయం పట్టుకుందని మంత్రి అన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న చోట దౌర్జన్యాలు జరుగుతున్నాయన్నారు. హరీశ్‌రావు గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురుతుందన్నారు. బీఆర్‌ఎస్‌పై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి గతంలో కలెక్టర్‌గా ఉన్నప్పుడు రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కున్నారని ఆరోపించారు. కవితను జైలు నుంచి బయటకు తీసుకురావడానికి కేసీఆర్ కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు కష్టపడుతున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగానే బీఆర్‌ఎస్ నాయకులను, బీజేపీలోకి పంపుతున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఐదు గ్యారంటీలను అమలు చేశామన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్‌లు తీసివేస్తామని, భయందోళనలకు గురి చేస్తున్నారన్నారు. దేవుడి పేరుతో అధికారంలోకి రావాలని చూస్తున్నారన్నారు. అందువల్ల నీలంమధును భారీ మెజారీటితో గెలిపించాలన్నారు. అంతకుముందు కాంగ్రెస్ అభ్యర్థి నీలం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేదింటి బిడ్డకు అవకాశం కల్పించిందని, ఆశ్వీరదించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, నర్సారెడ్డి, పూజల హరికృష్ణ, గాడిపల్లి శ్రీనివాస్ రెడ్డి, అత్తుఇమామ్, లక్ష్మి గంపమహేందర్‌రావు, కలీమొద్దీన్, బొమ్మల యాదగిరి, మీసం నాగరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి బీఆర్‌ఎస్ గతే

జగదేవ్‌పూర్(గజ్వేల్): రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు పట్టిన గతే కేంద్రంలో బీజేపీకి పడుతుందని దేవాదాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం దౌలాపూర్‌లో కాంగ్రెస్ యువ నాయకుడు బంగారురెడ్డి ఇంట్లో జరిగిన కార్యక్రమానికి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డిలతో మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవుళ్ల పేరు చెప్పుకుని బీజేపీ ఓట్లు అడుగుతోందన్నారు. అసంపూర్తిగా ఉన్న గుడిలో బాలరాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారని, దేశానికి అరిష్టమని పండితులు చెప్పినా మోదీ పట్టించుకోలేదని విమర్శించారు. మెదక్‌లో నీలం మధును భారీ మెజారీతో గెలిపించుకుని రాహుల్‌గాంధీకి కానుకగా ఇస్తామని తెలిపారు. సీఎం ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15 లోపు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పారు. సవాల్ చేసిన హరీశ్‌రావు రాజీనామాతో సిద్ధంగా ఉండాలని చెప్పారు.

హ్యాట్రిక్ సాధిస్తా..

కాంగ్రెస్‌తోనే పోటీ

- నేనే గెలుస్తానని సర్వేలు వెల్లడి
- అభివృద్ధి కోసమే బీఆర్‌ఎస్‌ను వీడాను
- నిరుద్యోగ సమస్య తీరుస్తా
- పదేళ్లుగా రూ.10 వేల కోట్లతో అభివృద్ధి
- జోగిపేట రైల్వేలైను ఏర్పాటుకు కృషి
- ‘సాక్షి’తో జహీరాబాద్ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్



‘పదేళ్లుగా నియోజకవర్గంలో అభివృద్ధికి బాటలు వేశాను. ప్రజలకు అందుబాటులో ఉంటూనే ఎంపీ నిధులతో రోడ్లు, మురికి కాల్వల నిర్మాణం చేపట్టాను. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాను. దివ్యాంగులను, పేదలను సొంత ఖర్చుతో ఆదుకున్నాను. ఫలితంగా ఈ ఎన్నికల్లో మూడోసారి గెలుపొంది హ్యాట్రిక్ సాధించడం ఖాయం. ఈ సారి గెలిచి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తాను. రాష్ట్రంలో అధికారంలో లేని పార్టీతో అభివృద్ధి అసాధ్యమనే బీజేపీలో చేరాను. లింగాయత్ సమాజం కూడా నా వెంటే ఉంది. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ తనకు పోటీయే కాదు అని’జహీరాబాద్ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. ‘సాక్షి’కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలను వెల్లడించారు.

– జోగిపేట

☛ రెండు సార్లు ఎంపీగా గెలవడానికి అవకాశం ఇచ్చిన బీఆర్‌ఎస్ పార్టీని వదలడానికి గల కారణం?

నేను నిత్యం ప్రజల్లో ఉండి సేవలు అందించడం, సేవా కార్యక్రమాలు చేపట్టడం వల్లనే రెండు సార్లు ఎంపీగా గెలవగలిగాను. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలనే ఉద్దేశంతోనే బీజేపీలో చేరాను.

☛ ఈ ఎన్నికల్లో మీకు ఏ పార్టీతో పోటీ ఉంటుందని భావిస్తున్నారు?

ఇప్పటికైతే నాకెవరూ పోటీ అనుకోవడం లేదు. సర్వేలు మాత్రం బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్యే పోరు ఉంటుందని చెబుతున్నాయి. మొదటి స్థానంలో మాత్రం బీజేపీయే ఉంటుంది.

☛ ఎంపీగా గెలుపొందితే మీ ప్రణాళిక ఏమిటీ?

జోగిపేట రైల్వేలైను ఏర్పాటుకు కృషి చేస్తా. ఇదివరకే ఈ లైను కోసం సర్వే కూడా పూర్తయ్యింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించాల్సి ఉంటుంది. పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తా. ఈ నియోజకవర్గం చాలా వెనుకబడిన ప్రాంతం. నిరుద్యోగ సమస్య కూడా తీవ్రంగా ఉంది. ఈసారి ఎంపీగా గెలవగానే నారాయణఖేడ్, అందోల్, కామారెడ్డి, ఎల్లారెడ్డి ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తా.

☛ జహీరాబాద్ ప్రాంతానికి మంజూరైన నిమ్జ్ ప్రాజెక్టుకు సంబంధించిన పనులు ముందుకు సాగడంలేదన్న విమర్శలున్నాయి?

జహీరాబాద్ నిమ్జ్ ప్రాజెక్టు పనులను పూర్తి చేయించేందుకు నా వంతుగా కృషి చేస్తా.

☛ జహీరాబాద్ ప్రాంతంలోని ట్రైడెంట్ పరిశ్రమలో క్రషింగ్ నిలిచిపోయింది. ఏమైనా చర్యలు తీసుకుంటారా?

తప్పకుండా ట్రైడెంట్ పరిశ్రమలో క్రషింగ్ యథావిధిగా జరిగేలా చర్యలు తీసుకుంటా. రైతులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వంతో చర్చలు జరుపుతా.

☛ జహీరాబాద్ లోకసభ నియోజకవర్గం పరిధిలో ప్రధాని మోదీ పర్యటన ఉందా..?

అవును.. జహీరాబాద్ లోకసభ పరిధి అందోల్ నియోజకవర్గంలో ప్రధాని పర్యటించనున్నారు. ఇక్కడ సభ నిర్వహించడం వల్ల జహీరాబాద్, మెదక్ నియోజకవర్గాలు కవరయ్యే అవకాశం ఉంటుంది.

☛ పదేళ్లలో ముఖ్యంగా మీరు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ఏమైనా ఉన్నాయా?

161 బీబీ మద్నూర్ -రుద్రూర్- బోధన్ ఫోర్ లేన్ల రహదారికి రూ.వెయ్యి కోట్లు మంజూరు చేయించా. 161 బీ నేషనల్ హైవే మీద 49 కి.మీ పరిధిలో నిజాంపేట-నారాయణఖేడ్-బీదర్ ప్రాజెక్టుల కోసం రూ.512 కోట్లు మంజూరయ్యాయి. పనులు కొనసాగుతున్నాయి. 765డి నేషనల్ హైవే నర్సాపూర్-మెదక్ - బాన్సువాడ- రుద్రూర్ ప్రాజెక్టు కోసం రూ.426 కోట్లు మంజూరయ్యాయి. పనులు కొనసాగుతున్నాయి. జోగిపేట పట్టణంలో నాలుగు లేన్ల అంతర్గత రహదారి నిర్మాణానికి రూ.13 కోట్లు మంజూరయ్యాయి.

☛ పదేళ్లలో మీరు నియోజకవర్గానికి ఎన్ని నిధులు మంజూరు చేయించారు?

పదేళ్లలో జహీరాబాద్ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.10వేల కోట్లు మంజూరు చేయించా.

☛ నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి ఎలాంటి కృషి చేశారు?

కేతకీ సంగమేశ్వరాలయం, ఝరాసంగం, రేజింతల్, సిద్ధివినాయక దేవాలయం, నల్ల పోచమ్మ, బోరంచ, ఏడపాయల దుర్గాభవానీ కలిపి పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేసేందుకు రూ.66 కోట్ల ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపా.

కాంగ్రెస్‌లో చేరిక



మంత్రి పొన్నం, జగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన శ్రీనివాస్

సిద్దిపేటఅర్బన్: ఉపాధి హామీ పథకం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, మిట్టపల్లి పీఏసీఎస్ డైరెక్టర్ సిద్ధరబోయిన శ్రీనివాస్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సమక్షంలో హస్తం గూటికి చేరారు. శ్రీనివాస్‌కు మంత్రి పొన్నం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గతంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, ఉమ్మడి మెదక్ జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన శ్రీనివాస్ తెలంగాణ ఉద్యమం సమయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. మిట్టపల్లి గ్రామ సర్పంచ్‌గా, పీఏసీఎస్ చైర్మన్‌గా, మెదక్ డీసీసీబీ డైరెక్టర్‌గా పదవులు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలోకి మళ్లీ రావడం సంతోషంగా ఉందని అన్నారు.

పేదల సంక్షేమమే ముఖ్యం

- మంత్రి పొన్నం ప్రభాకర్
- కోహెడలో రోడ్ షో



రోడ్డ్ షోలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావు

కోహెడ(హుస్నాబాద్): పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తనను ఆశీర్వదించిన మాదిరిగానే రాజేందర్‌రావును కూడా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బండి సంజయ్ భాగ్యలక్ష్మిగుడి, అమ్మవారి గుడి అంటూ గుళ్లుగోపురాల చుట్టూ తిరగడం తప్ప ఎంపీగా కరీంనగర్‌కు చేసిందేమి లేదన్నారు. రాముడి పేరుతో ఓట్లు అడుగుతున్నారని ఎద్దేవా చేశారు. మత రాజకీయం చేసే బీజేపీని గద్దె దించే అవకాశం వచ్చిందని, అన్ని మతాలను గౌరవించే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మర్చారన్నారు. విద్యావంతుడైన రాజేందర్‌రావును గెలిపిస్తే.. కరీంనగర్ సస్యశ్యామలం అవుతుందన్నారు. కాగా రోడ్ షోకు ప్రజలు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో అభ్యర్థి రాజేందర్‌రావు, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, నాయకురాలు మంజులారెడ్డి, ధర్మయ్య, జగన్‌రెడ్డి, లక్ష్మణ్, రఫీ పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో 18.. మెదక్‌లో ఒకటి

- నామినేషన్ల తిరస్కరణ
- 29 వరకు ఉపసంహరణకు గడువు



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి క్రాంతి

సంగారెడ్డి టౌన్: జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ స్థానానికి దాఖలైన నామినేషన్లను శుక్రవారం కలెక్టరేట్‌లో ఎన్నికల పరిశీలకులు గోపాల్ జి తివారి సమక్షంలో పరిశీలించారు. మొత్తం 40మంది అభ్యర్థులు 68 నామినేషన్లు దాఖలు చేయగా, స్క్రూటినీలో 14మంది అభ్యర్థులకు సంబంధించిన 18 నామినేషన్లు తిరస్కరించబడ్డాయని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వల్లూరి క్రాంతి తెలిపారు. అఫిడవిట్ సమర్పించకపోవడం, సక్రమంగా లేకపోవడం, నామినేషన్ పత్రాలపై సంతకాలు చేయకపోవడం, ప్రతిపాదకుల వివరాలు పొందుపర్చకపోవడం వంటి కారణాల వల్ల నామినేషన్లు తిరస్కరించబడ్డాయన్నారు.

మెదక్ నియోజకవర్గంలో..

మెదక్ కలెక్టరేట్: మెదక్ పార్లమెంట్ స్థానానికి 54 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా ఒక నామినేషన్ తిరస్కరణకు గురైంది. ప్రస్తుతం 53 మంది పార్లమెంట్ బరిలో ఉన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్‌రాజ్ అధికారులతో కలిసి నామినేషన్ల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో సంగారెడ్డి జిల్లాకు చెందిన కళ్లు నర్సింహగౌడ్ (స్వతంత్ర అభ్యర్థి) నామినేషన్‌ను తిరస్కరణకు గురైనట్లు కలెక్టర్ తెలిపారు. శనివారం సెలవు దినం కావడంతో 29వ తేదీ విత్‌డ్రాకు అవకాశం ఉందన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేయాలని సూచించారు. సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అన్నారు. అలాగే ముగ్గురు అభ్యర్థులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపారు. ఇందులో రఘునందన్‌రావు (బీజేపీ) నీలం మధు (కాంగ్రెస్) వెంకట్రామిరెడ్డి (బీఆర్‌ఎస్) మూడుసార్లు న్యూస్ పేపర్‌లో వారికి ఇచ్చిన ఈ1, ఈ2, ఈ3 ప్రొఫార్మాలు ప్రచురణ చేయాల్సి ఉంటుందన్నారు. హోం ఓటింగ్ ప్రక్రియలో భాగంగా 85 సంవత్సరాలు దాటిన వయోవృద్ధులు 40 శాతంపైబడిన దివ్యాంగులకు ఫారం 12డీ అందజేసినట్లు పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు మెదక్, నర్సాపూర్ ఆర్డీఓ కార్యాలయాలతో పాటు కలెక్టర్ కార్యాలయంలో పోస్టల్ ఓటింగ్ బూత్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల సాధారణ పరిశీలకుడు సమీర్ మాధవ్ కుర్కొటి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీల్లో ..

దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు తృతీయ బహుమతి



బహుమతి సాధించిన విద్యార్థులు, అధ్యాపకులు

దుబ్బాక: హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి 2023–24 జిజ్ఞాస పోటీల్లో దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు తృతీయ బహుమతి వరించింది. గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ, కమిషనరేట్ ఆఫ్ కాలేజీ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీల్లో అర్థశాస్త్ర విభాగంలో విద్యార్థులు తృతీయ బహుమతి సాధించారు. బీఏ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థినులు స్రవంతి, శిరీష, దివ్య, జైనిష, రమ్య రూపొందించిన ఆర్థిక వికాసం-పరపతి సహకార సంఘాలు, సిద్దిపేట జిల్లా ఆటో క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ ఒక ప్రత్యేక అధ్యయనం అంశంపై అర్థశాస్త్ర ఉపన్యాసకురాలు పొన్నాల సునీత ఆధ్వర్యంలో రూపొందించిన స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టుకు అవార్డులు వచ్చాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భవానీ, వైస్ ప్రిన్సిపాల్ రమేశ్‌లో బహుమతి సాధించిన విద్యార్థులు, ప్రాజెక్టు రూపకల్పనకు మార్గదర్శకంగా నిలిచిన అధ్యాపకురాలు సునీతను ప్రత్యేకంగా అభినందించారు.

రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

ఎన్నికల సాధారణ పరిశీలకులు సమీర్ మాధవ్ కుర్కోటీ



మాట్లాడుతున్న సమీర్ మాధవ్ కుర్కోటీ

మెదక్ కలెక్టరేట్: కలెక్టర్ రాహుల్‌రాజ్ సమక్షంలో కలెక్టరేట్‌లో రెండవ విడత ర్యాండమైజేషన్ జరిగింది. ఎన్నికల సాధారణ పరిశీలకులు సమీర్ మాధవ్ కుర్కోటీ పర్యవేక్షించారు. సాఫ్ట్‌వేర్ పనితీరు పోలింగ్ సిబ్బంది అలాట్మెంట్ వివరాలను టెక్నికల్ మేనేజర్‌ను పరిశీలకులు అడిగి తెలుసుకున్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా నిర్వహించి, సిబ్బందిని సెకండ్ రాండమైజేషన్ ద్వారా అలాట్ చేశామని పేర్కొన్నారు. ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, ఓపీఓలను మొత్తం 3,540 అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అలాట్ చేశామని పేర్కొన్నారు. వీరికి ఎన్నికల విధులపై శిక్షణ కార్యక్రమం త్వరలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. చివరగా జరిగే పోలింగ్ పర్సన్ మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియలో పోలింగ్ సిబ్బందిని పోలింగ్ బూత్‌ల వారీగా కేటాయిస్తామని తెలిపారు.

గుడుంబా ప్యాకెట్లు స్వాధీనం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలో శుక్రవారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా నాలుగు లీటర్ల గుడుంబా ప్యాకెట్లను పట్టుకున్నారు. తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో తరిగొప్పుల మండలం బొత్తల పర్రె తండాకు చెందిన భూక్య రవి నాలుగు లీటర్ల నాటుసారా తరలిస్తుండగా పట్టుకున్నామని సీఐ పవన్ పేర్కొన్నారు. అదే విధంగా కోహెడ మండలం బస్వాపూర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా తాటిచెట్లను నేలమట్టం చేసిన జేసీబీతో పాటు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బస్వాపూర్ టూ గల్ఫ్

అరబ్ దేశాలకు ఇంటికొకరు

- యువకులంతా అక్కడికే
- బతుకుదెరువు కోసం పెరుగుతున్న వలసలు
- మండల వ్యాప్తంగా సుమారు 3,000 మంది
- బస్వాపూర్‌లో అత్యధికంగా 500 మందికి పైనే..



కోహెడ మండలం బస్వాపూర్ గ్రామం గల్ఫ్ దేశాల వలసలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. గ్రామం నుంచి సుమారు 500 మందికి పైగా వివిధ దేశాలకు పయణమయ్యారు. కుటుంబ అవసరాలు, ఇతర పరిస్థితుల కారణంగా 40 ఏళ్లుగా ప్రతీ ఇంటి నుంచి ఒకరో, ఇద్దరో సంపదన మీద ఆశతో వలస బాట పడుతూనే ఉన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో అరబ్ దేశాలకు వలసబాట పట్టారు. అత్యధికంగా బస్వాపూర్‌లో వెళ్లారు.

– కోహెడరూరల్(హుస్నాబాద్)

బస్వాపూర్‌లో అత్యధికంగా వ్యవసాయంపై ఆధారపడిన మధ్యతరగతి కుటుంబాలే. మెట్ట ప్రాంతం కావడంతో ఆరుతడి పంటలతో వరి పంటలు సాగు చేస్తూ గ్రామస్తులు జీవనం కొనసాగిస్తున్నారు. వరుస కరువుతో బోర్లు, బావులు ఎండిపోయాయి. కష్టపడి పంటలు వేసినా అనుకున్న స్థాయిలో దిగుబడి రాక అప్పుల పాలయ్యారు. దీంతో రైతులు కూలీలుగా మారారు.. అయినా వచ్చిన డబ్బులు కుటుంబపోషణకు కూడా సరిపోలేదు. ఈ క్రమంలోనే మనోవేదనకు గురై ఎడారి దేశాలకు పయణమయ్యారు.

18 ఏళ్లు నిండిన వెంటనే పాస్‌పోర్ట్

ఆడ బిడ్డ పెళ్లి కోసం అప్పు చేసి కొందరు.. ఇల్లు కట్టడానికి అప్పు అయిందని మరికొందరు.. సాగు చేసిన పంటలు అనుకున్నంత దిగుబడులు రాక ఇంకొందరు.. ఎంత చదివినా సరిపడా వేతనం వచ్చే ఉద్యోగం దొరక్క యువత.. ఇలా అందరూ అరబ్ ప్రాంతాలకు వలసల బాట పట్టారు. ఇక్కడి యువత 18 ఏళ్లు నిండిన వెంటనే పాస్‌పోర్ట్ తీయడం అలవాటు చేసుకున్నారు. కన్నతల్లిదండ్రులను వదిలి కన్నీటి దారలో పరాయి దేశానికి వలస వెళ్లి రెక్కలు ముక్కలు చేసుకొని కుటుంబాలను పోషించుకుంటున్నారు.



చెట్ల కింద నిద్రిస్తున్న కార్మికులు

మండల వ్యాప్తంగా 3,000 మంది..

కోహెడ మండలం బస్వాపూర్ గ్రామంలో గల్ఫ్ దేశాలపై మోజు తగ్గండం లేదు. ప్రతీ గుమ్మం నుంచి ఒక కాలు ఎడారి దేశాల గడప తొక్కుతుంది. ఇక్కడ ఉపాధి లేక పండిన పంటకు దిగుబడి రాక అక్కడికి వెళ్తే కాస్త ఎక్కువగా సంపదించవచ్చని ఆశ అటు వైపు అడుగులు వేయిస్తోంది. బస్వాపూర్ గ్రామంతోపాటు కోహెడ మండల వ్యాప్తంగా సుమారు 3,000 మందికి పైగా ఎడారి దేశాలకు వెళ్లారు. ప్రతీ గ్రామం నుంచి 40 నుంచి 50 మంది వరకు ఊరిని విడిచిపెట్టి వెళ్లిన వారే. అత్యధికంగా బస్వాపూర్ గ్రామం నుంచి 500 నుంచి 600 మంది వరకు వలస వెళ్లారు. ఇక్కడ చేసేందుకు ఉపాధి లేక తమ రెక్కల కష్టాన్ని నమ్ముకొని దేశం విడిచి పోతున్నారు.

రోజుకు 12 గంటలు



నేను గల్ఫ్‌లో ఓ ప్రవేట్ కంపెనీలో పని చేస్తా. సుమారు ప్రతీ రోజు 12 గంటలు పని ఉంటుంది. సొంత ఊరిలో ఉపాధి లేక బతుకు దెరువు కోసం మూడేళ్ల కిందట ఇక్కడికి వచ్చా. పనికి దగ్గట్టు వేతనాలు లేవు.

–గాదాసు రాజు,బస్వాపూర్

17 ఏళ్లు అక్కడే ఉన్న



సంపద మీద ఆశతో దుబాయ్ వెళ్లాను. పనికి సరిపడా జీతం లేకపోయినా కుటుంబ పోషణ కోసం 17 ఏళ్లు అక్కడే ఉండి పని చేశాను. ఇటీవల ఇక్కడికి వచ్చి కూలీ పనికి వెళ్తున్నా.. ఎన్ని రోజులు దేశం పోయినా ఇక్కడికి వచ్చి పని చేయంది నడుస్తలేదు.

–తాటిపాముల దేవరాజ్, బస్వాపూర్



సమావేశంలో మాట్లాడుతున్న ఆనందరావు

కెమిస్ట్రీపై పట్టు సాధించాలి

- వర్క్‌షాపుతో నైపుణ్యాలు పెంపొందించుకోవాలి
- ఓయూసీఎఫ్ ఉపాధ్యక్షుడు ఆనందరావు

సిద్దిపేటఎడ్యుకేషన్: విద్యార్థులు కెమిస్ట్రీపై పట్టు సాధించి పరిశోధనలు చేసి సమాజానికి ఉపయోగపడే వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని ఉస్మానియా కెమిస్ట్రీ ఫౌండేషన్(ఓయూసీఎఫ్) ఉపాధ్యక్షుడు, రిటైర్డ్ ప్రొఫెసర్ ఆనంద రావు అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో క్రొమాటో గ్రఫీ ఆధునిక పద్ధతులపై రెండ్రోజుల పాటు నిర్వహించనున్న వర్క్‌షాప్ శుక్రవారం ప్రారంభమైంది. కళాశాల కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి ఆనందరావు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కెమిస్ట్రీపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించేందుకు నిర్వహించే కార్యక్రమాలకు తమ వంతు పూర్తి సహకారాన్ని అందిస్తామన్నారు. ఐఐసీటీ శాస్త్రవేత్త డాక్టర్ దేభాషీష్ స్పైన్ అడ్వాన్స్‌డ్ క్రొమాట్రోఫీ పద్ధతులను గురించి విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్, వర్క్‌షాప్ కన్వీనర్, కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ వాసం శ్రీనివాస్ మాట్లాడుతూ స్పిన్కో బయోటెక్, ఓయూసీఎఫ్‌ల సహకారంతో రెండ్రోజులపాటు నిర్వహించే ఈ వర్క్‌షాప్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. అనంతరం స్పిన్కో బయోటెక్ ప్రాంతీయ మేనేజర్ కృష్ణ, అరుణ్‌సింగ్‌ల బృందం క్రొమాటోగ్రఫీ పరికరాలపై విద్యార్థులకు శిక్షణను అందించారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బాలకిషన్, కో కన్వీనర్లు ఆంజనేయులు, డాక్టర్ రవికుమార్, డాక్టర్ సుమలత, శ్యాంసుందర్, సలీం పాషా, డాక్టర్ రవికుమార్, కళాశాల పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ గోపాలసుదర్శనంతోపాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే ముదిరాజులకు భవిష్యత్

- అభ్యర్థి వెంకట్రాంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం
- సంఘం మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదగిరి

తూప్రాన్: తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ చేతుల్లోనే ముదిరాజుల భవిష్యత్ పదిలంగా ఉంటుందని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది కొట్టాల యాదగిరి ముదిరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కోనాయిపల్లి (పీబీ)గ్రామంలో మాట్లాడుతూ.. మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డికి మద్దతుగా గ్రామాల్లో ముదిరాజులు ఏకగ్రీవ తీర్మానాలు చేద్దామని పిలుపునిచ్చారు. ముదిరాజుల ఆర్థికాభివృద్ధికి కేసీఆర్ ప్రతిష్టాత్మక పథకాలు అమలు చేసినట్లు గుర్తు చేశారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, విడిపోతే నష్టపోతామని, గోస పడతామని స్పష్టం చేశారు. చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లో చేపలు పట్టే హక్కులు కల్పించడంతోపాటు ముదిరాజ్ ఆత్మగౌరవ భవన నిర్మాణానికి కోకాపేటలో విలువైన 5 ఎకరాల భూమి, రూ.5 కోట్లు కేటాయించిన ఘనత కేసీఆర్‌కు దక్కిందన్నారు. కులాల పేరిట చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్న బీజేపీ అభ్యర్థికి తగిన బుద్ధి చెప్పే విధంగా ముదిరాజులు ఐక్యంగా ఉంటూ అన్ని రకాలుగా ఆదుకున్న కేసీఆర్‌కు అండగా ఉందామని తెలిపారు. సమావేశంలో మాజీ సర్పంచ్ కంకణాల పాండు ముదిరాజ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు విఠల్, యూత్ అధ్యక్షులు నాగరాజు, మల్కాపూర్ జిన్నా రాజు, నర్సంపల్లి శేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యాదగిరి

మాదిగలకు కాంగ్రెస్ ద్రోహం



మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

వెల్దుర్తి(తూప్రాన్): మాదిగలను రాజకీయంగా ఎదగకుండా కాంగ్రెస్ పార్టీ నమ్మించి ద్రోహం చేసిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మాసాయిపేటలో నిర్వహించిన మెదక్ లోక్‌సభ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్, దాని అనుబంధ సంఘాల సన్నాహక సమావేశంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుతో కలసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ.. మాట ఇచ్చి మోసం చేయడంలో కాంగ్రెస్ పార్టీ ఆరితేరిందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో మాదిగలకు మూడు, నాలుగు సీట్లు రావాల్సి ఉండగా ఒకటి కూడా ఇవ్వకుండా కాంగ్రెస్ అధిష్టానం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కక్షపూరితంగా వ్యవహరించారని ఆరోపించారు. కేసీఆర్ నియంతృత్వంతో మాదిగలు నష్టపోయారని, అందుకే ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఎవరూ ఓటు వేయొద్దని విజ్ఞప్తి చేశారు. బీజేపీ తమ సమస్యలు పరిష్కరించేందుకు హామీనిచ్చిందని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి పూర్తి మద్దతు ఇచ్చామని ప్రకటించారు.

ధాన్యం కుప్పను ఢీకొని..

దంపతులకు గాయాలు

వెల్దుర్తి(తూప్రాన్): రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పను ఢీకొని బైక్ బోల్తా పడడంతో దంపతులకు గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండలంలోని యశ్వంతరావ్‌పేట గ్రామ శివారులో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మానెపల్లి గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడు హన్మంతు మధు, భార్య సుజాతతో కలిసి శివ్వంపేట మండలం కొత్తపల్లి చౌరస్తాలో జరిగే మార్కెట్‌కు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పను ఢీకొని బైక్ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో దంపతులిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను నర్సాపూర్ ఆస్పత్రికి తరలించారు.

ముగ్గురు అభ్యాసకులు డిబార్

సహకరించిన ఇద్దరు ఇన్విజిలేటర్లను విధుల నుంచి తొలగింపు

కొండాపూర్(సంగారెడ్డి) /రామచంద్రాపురం (పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ జిల్లా పరిషత్ పాఠశాలలో జరుగుతున్న ఓపెన్ స్కూల్, ఇంటర్మీడియట్, పదవ తరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా శుక్రవారం మాస్ కాపీకి పాల్పడుతున్న ముగ్గురిని డిబార్ చేశారు. కాపీయింగ్‌కు సహకరించిన ఇద్దరు ఇన్విజిలేటర్‌లను విధుల నుంచి తొలగించారు. పరీక్షలను జిల్లా స్థాయి పరిశీలకులు వెంకటనర్సమ్మ తనిఖీ చేశారు. ఒక విద్యార్థి బదులు మరో విద్యార్థి పరీక్ష రాస్తున్నట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇచ్చేలోపే ఆ వ్యక్తి పరారయ్యాడు. డీఈఓ వెంకటేశ్వర్లు పటాన్‌చెరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల పాఠశాల, బాలుర జూనియర్ కళాశాలను సందర్శించారు.

ఇద్దరిపై కేసు నమోదు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఓపెన్ టెన్త్‌లో ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాస్తూ పట్టుబడిన సంఘటన సిద్దిపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పారుపల్లిలో జరిగిన ఓపెన్ టెన్త్ ఇంగ్లిష్ పరీక్షలో భాగంగా ఎన్సాన్‌పల్లికి చెందిన రవీందర్‌గౌడ్‌కు బదులుగా అదే గ్రామానికి చెందిన బాలకిషన్ పరీక్ష రాస్తున్నారు. ఎగ్జామ్ సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ గుర్తించి పోలీస్‌లకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

దుబ్బాకటౌన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన దౌల్తాబాద్ మండలం పరిధిలోని దొమ్మాట గ్రామ శివారులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. దౌల్తాబాద్ ఎస్సై ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాల ప్రకారం.. మిరుదొడ్డి మండలం చెప్యాల గ్రామానికి చెందిన అక్కరాజు నర్సింలు (35) పని నిమిత్తం గురువారం దొమ్మాట గ్రామంలో ఉన్న బంధువుల ఇంటికి బైక్ పై వెళ్లాడు. తిరిగి ఇంటికొస్తున్న క్రమంలో దొమ్మాట - చెప్యాల మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న బైక్ ఢీ కొట్టడంతో నర్సింలు తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం మృతుడి భార్య అక్కరాజు స్వప్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

హవేళిఘణాపూర్(మెదక్): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ముత్తాయిపల్లి గేటు సమీపంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని ముత్తాయిపల్లి గ్రామానికి చెందిన ఏగొండ(55) శుక్రవారం సాయంత్రం హవేళిఘణాపూర్ నుంచి ముత్తాయిపల్లి వెళ్తున్న క్రమంలో ముత్తాయిపల్లి గేటు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏగొండకు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య అనుసూయ, కుమారుడు ఉన్నాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడకు చెందిన శ్రీను కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మద్యానికి బానిసైన శ్రీను పనికి వెళ్లకపోవడంతో భార్య రమణ పనికి వెళ్లాలని మందలించింది. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన అతడి సోదరుడి కుమారుడు సాగర్ శ్రీనును చికిత్స నిమిత్తం ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భారీగా నగదు పట్టివేత

ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు

రూ.2.30 లక్షల నగదు, బంగారం పట్టివేత

రాయపోలు(దుబ్బాక): తొగుట సీఐ లతీఫ్, రాయపోల్ ఎస్ఐ రఘుపతి సిబ్బందితో కలిసి కొత్తపల్లి చౌరస్తాలో శుక్రవారం రాత్రి ఆకస్మికంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో నలుగురి వాహనాల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా రూ. 2.30 లక్షల నగదు, 139.19 గ్రాముల బంగారు ఆభరణాలు తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. వెంటనే వాటిని సీజ్ చేసి కలెక్టర్ కార్యాలయంలో ఉన్న గ్రీవెన్స్ సెల్‌లో అందజేసినట్లు పోలీసులు తెలిపారు.

రూ.2.10 లక్షలు

కోహీర్(జహీరాబాద్): కోహీర్ రైల్వే గేటు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పుల్కల్ నివాసి సాయి కృష్ణ వద్ద రూ.2.10 లక్షలు పట్టుకొని సీజ్ చేశామని ఎస్సై కృష్ణ గౌడ్ తెలిపారు. డబ్బుకు సంబంధించి సరైన ఆధారాలు లేవన్నారు.

రూ.1.98 లక్షలు పట్టివేత

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హుస్సెల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టు దగ్గర వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎలాంటి అనుమతులు లేకుండా తీసుకెళ్తున్న రూ.1.98 లక్షలు పట్టుకున్నట్లు హద్నూర్ ఎస్ఐ రామానాయుడు తెలిపారు.

రూ.1.80 లక్షలు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మండలంలోని మాడ్గి చెక్ పోస్టు వద్ద శుక్రవారం పోలీసులు రూ. 1.80 లక్షల నగదును పట్టుకున్నారు. కర్నాటక నుంచి వస్తున్న వాహనాలు తనిఖీలు నిర్వహించగా అనుమతులు లేకుండా తరలిస్తున్న నగదును పట్టుకొని ఎన్నికల అధికారులకు అప్పగించామని ఎస్ఐ నరేశ్ తెలిపారు.



మర్కూక్(గజ్వేల్): డబ్బులు పట్టుకున్న పోలీసులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల కేంద్రంలోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద రూ.78 వేలు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్సై వివేక్ తెలిపారు. మందమర్రి గ్రామానికి చెందిన అకూష్ రూ.78 వేలు తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సీజ్ చేశామన్నారు.

మర్కూక్(గజ్వేల్): మండలంలోని శివారు వెంకటాపూర్ గ్రామ శివారులో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అదే గ్రామానికి చెందిన కమ్మన రాజు రూ.60 వేలు తీసుకెళ్తుండగా పట్టుకొని సీజ్ చేశామని ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

నిప్పు.. భూసారానికి ముప్పు

- వరి కొయ్యకాళ్లు కాల్చివేత
- పంటల సాగు పై ప్రభావం
- రైతులకు అవగాహన కల్పించని అధికారులు

కోహెడ(హుస్నాబాద్): వరి కోత తర్వాత రైతులు తమ పొలంలోని కొయ్యకాళ్లను నిప్పుతో కాల్చి వానాకాలం పంటకు సిద్ధం అవుతున్నారు. నిప్పుతో భూసారం దెబ్బతింటుందని తెలియని రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించటంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రైతులకు పంట దిగుబడి పై తీవ్రంగా నష్టం జరుగుతుంది.

పత్తాలేని భూసార పరీక్షలు

అధికారులు ఏడాదిలో ఒక్కసారి అయినా రైతుల వ్యవసాయ భూమిలో మట్టిని సేకరించి పరీక్షలు చేసిన దాఖలాలు లేవు. భూసార పరీక్షలు నిర్వహించి అనుకూలమైన పంట వేయాలని అధికారులు సూచించాలని మండల రైతాంగం కోరుతున్నారు.

ఇష్టానుసారంగా వరి కోతలు

హార్వెస్టర్లతో వరి కోతలు సరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో డ్రైవర్లు ఇష్టానుసారంగా వరి పంటను సగం వరకే కట్ చేయడంతో కొయ్యకాళ్ల సమస్య తలెత్తుతోంది. పొలంలో కొయ్యకాళ్ల తీవ్రత ఎక్కువ ఉంటే పొలం దున్నకం, పంట దిగుబడి సరిగా ఉండదని నిప్పుతో కాల్చడం తప్పడం లేదంటున్నారు రైతులు.

పశుగ్రాసం కొరత

హార్వెస్టర్ల కోతలతో పశుగ్రాసానికి కొరత ఏర్పడుతుంది. ఎకరం పొలం కోసినా ఒక ఫసల్‌కు రెండు పశువులకు సరిపడా పశుగ్రాసం సరిపోవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎకరం పొలంలోని పశుగ్రాసానికి రూ.3 వేలు చెల్లించి కొనుగోలు చేయడం తప్పడం లేదని పాడి రైతులు అపోతున్నారు.



కొయ్యకాళ్లను నిప్పుతో కాల్చిన రైతు

పంట రాదనే కాల్చుతున్నాం



వరి కోతమిషన్ వాళ్లు వరిని కిందికి కొయ్యమంటే మిషన్‌లో గడ్డి తట్టుకొని వద్దు పోతాయని పైకి కోస్తుండ్రు. భూమిలో కొయ్యకాళ్లు ఎక్కువ ఉంటే దున్నకం పడదు, పంట కూడా సరిగా రాదని అగ్గితో కాల్చుతున్నాం. అగ్గితో కొయ్యకాళ్లు కాల్చితే భూమి దెబ్బతింటుందనే సంగతి తెలియదు. అధికారులు కూడా ఎప్పుడు చెప్పలేదు.

– దానబోయిన వెంకటస్వామి, రైతు కోహెడ

పొలంలోనే దున్నాలి



వరి కొయ్యకాళ్లు నిప్పుతో కాల్చడంతో భూసారం కోల్పోతుంది. కొయ్యకాళ్లను పొలంలోనే దున్నితే సూక్ష్మపోషకాలు వృద్ధి చెందుతాయి. భూమిలో దున్నడం ద్వారా భూమిలోని కాల్షియం, మెగ్నీషియం, సూక్ష్మజీవులు పంటకు మేలు చేస్తాయి. నత్రజని పెరిగి మిత్ర పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి.

– భోగేశ్వరస్వామి, మండల వ్యవసాయ అధికారి